క్లుప్తంగా

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న పోలేబోయిన వరలక్ష్మి

మిర్యాలగూడ అర్బన్ : వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు తెలిపిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పాదూరి గోవర్ధన, కరిమున్నీసాబేగం, వీఓఏలు లక్ష్మి, చంద్రకళ తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

హాలియా : పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్ కాలనీలోని స్వయంభూ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవీల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యుల పర్యవేక్షణలో పంచరాత్ర ఆగమ పండితులు శేషభట్టర్, సంతోష్‌కుమారాచార్యులు, విజయనరసింహాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమ్మేత శ్రీవేంకటేశ్వర స్వామి తిరు కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మల్లిఖార్జున, రవీందర్, భాగ్య, చంద్రకళ, హేమలత తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

డిండి : మండల కేంద్రానికి చెందిన కంపిలి కుమార అనారోగ్యంతో మృతి చెందాడు. పట్టణానికి చెందిన శివపార్వతీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మృతుడి భార్య మణెమ్మకు రూ. 15వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పోలం శ్రీను, గుడి రాములు, పోలం లక్ష్మణ్, గిరమోని శ్రీను, తవిటి సుధాకర్, పోలం మల్లేష్, కంపిలి రమేష్ పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శిగా చందర్‌రావు


కార్యదర్శిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బంది

నిడమనూరు : నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన కార్యదర్శిగా తోట చందర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి గ్రేడ్ 2 కార్యదర్శిగా పనిచేసిన చందర్‌రావుకు ప్రభుత్వం గ్రేడ్ 1 కార్యదర్శిగా పదోన్నతి ఇచ్చి నిడమనూరుకు బదిలీ చేసింది. సహాయ కార్యదర్శిగా ఉన్న వేణు కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించిన తోట చందర్‌రావును ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చందర్‌రావు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వేణు, వరంగల్ మార్కెట్ సూపర్‌వైజర్స్ శివకుఆమర్ గంగాధర్, సిబ్బంది మురళి, వెంకన్న, నిడమనూరు మార్కెట్ సూపర్‌వైజర్ మౌనిక ఉన్నారు.

గౌతమ బుద్ధుడి జయంతి


బుద్ధుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : పట్టణంలో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను దళిత ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన జయంతి వేడుకల్లో డాక్టర్ ఏకుల రాజారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డివిజన్ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, టీఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పొట్ల సుగుణయ్య, కె.వెంకటయ్య, మురళీకృష్ణ, శ్రీనివాస్, రమేశ్ నాయక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

1104 సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో 132 కేవీ విద్యుత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మే డే ఉత్సవాల్లో భాగంగా 1104 సంఘం ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తూమ్ జైపాల్‌రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరి నరేందర్, జంగారెడ్డి, అనంతం తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతకు సన్నద్ధం !

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

- 1310 యూనిట్లు మంజూరు
- యూనిట్ విలువ రూ.1.75లక్షలకు పెంపు
- లబ్ధిదారులు తమ వాటాధనం చెల్లించేలా అవగాహన



పెద్దవూర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ రెండో విడతకు మళ్లీ కదలిక వచ్చింది. రెండో విడతలో 1310 యూనిట్ల గొర్రెల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గొల్ల, కురుమలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 75శాతం రాయితీతో గొర్రెలను అందించనుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెల పెంపకం దారుల సొసైటీలను సైతం ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా 18ఏళ్ల పైబడిన యాదవ కులస్తులు ఒక సంఘంలో సభ్యత్వం పొంది ఉండాలనే నిబంధన విధించింది. లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి రెండు విడతలుగా రెండేళ్ల కాలంలో గొర్రెలను పంపిణీ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఐదేళ్ల తర్వాత ముందుకు వచ్చింది.

పెరిగిన యూనిట్ ధర

మొదటి విడతలో ఒక్కో యూనిట్ విలువ రూ.1,25,000లు కాగా లబ్ధిదారుడు తన వాటాగా రూ.31,250లు చెల్లిస్తే దానికి ప్రభుత్వం రూ.93,750లు సబ్సిడీగా చెల్లించి గొర్రెలను పంపిణీ చేసింది. అయితే గొర్రెల యూనిట్ ధరను ప్రభుత్వం రూ.1.25 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు పెంచింది. ఈ లెక్కన ప్రతీ లబ్ధిదారుడు తన వాటాధనం కింద రూ.43,750 చెల్లించాలి. గతంలో కంటే ప్రస్తుతం లబ్ధిదారుడు అదనంగా రూ.12,500లు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వాటాధనం పెంపు లబ్ధిదారులకు రుచించటం లేదు. ఐదేళ్లుగా వాటాధనాన్ని డీడీల రూపంలో చెల్లించి నిరీక్షిస్తుంటే మంజూరు చేయాల్సింది పోయి యూనిట్ ధరను పెంచి తమపై భారం మోపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

మండలానికి 2516 యూనిట్లు మంజూరు

2516 యూనిట్లలో మొదటి విడతలో 1265 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 1073 యూనిట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఉప ఎన్నిక సమయంలో మరో 133మందికి పంపిణీ చేశారు. ఇంకా మొదటి విడతలో రాయితీ గొర్రెలు రాని లబ్ధిదారులు 55 మంది ఉన్నారు. వీరంతా తన వాటా కింద చెల్లించాల్సిన రూ.31,250లు చెల్లించి డీడీలు తీసి అధికారులకు ఇచ్చారు. నాలుగన్నరేళ్ల గడుస్తున్నా ఇప్పటివరకు గొర్రెల సంగతి దేవుడెరుగు అప్పులు తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మొదటి విడతలో పర్వేదుల 24 యూనిట్లు, తుంగతూర్తి 164, చలకుర్తి 212, నాగార్జునసాగర్ 39, ఊట్లపల్లి 44, పులిచర్ల 154, పెద్దవూర 153, పోతునూరు 50, తెప్పలమడుగు 113, కొత్తలూరు 55, వెల్మగూడెం, గర్నెకుంట గ్రామాలు కలిపి 277 యూనిట్లు కలిపి మొత్తం 1265 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇందులో 1206 మాత్రమే పంపిణీ చేసి మమా అనిపించుకున్నారు.

నేరుగా కలెక్టర్ ఖాతాలో..

ఇకనుంచి లబ్ధిదారులు తమ వాటాధనాన్ని కలెక్టర్ యాక్సిస్ బ్యాంకులో ఉన్న లబ్ధిదారుల అకౌంట్‌లో ఆన్‌లైన్ ద్వారా జమచేయాలి. గతంలో డీడీల రూపంలో చెల్లించే విధానాన్ని తొలగించారు. అలాగే గొర్రెలను కొనేందుకు లబ్ధిదారులతో పశువైద్యులు వెళ్లరు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)లు, జిల్లా అధికారులు, వారి సహాయకులు యూనిట్లను గ్రౌండింగ్ చేయనున్నారు. ఇది ఇలా ఉండగా మునుగోడు తరహాలో తమకు గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని పలువురు కోరుతున్నారు.

మండల, జిల్లా స్థాయిలో టీంలు

గొర్రెల పంపిణీలో గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలకు ఈసారి ఆస్కారం లేకుండా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మండల స్థాయిలో పశువైద్యాధికారి, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ టీంలుగా ఉండి లబ్ధిదారుల వివరాలు పరిశీలించి 'ఈ ల్యాబ్‌లో' నమోదు చేస్తారు. దరఖాస్తుదారుల కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, నామినీ వివరాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ధరఖాస్తుదారుడు మృతి చెందితే వారి నామినీకి యూనిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే జిల్లా స్థాయిలో 12 బృందాలు, ఓ రిజర్వ్ టీంను ఏర్పాటు చేశారు. ఈ టీంలు ఈ ల్యాబ్‌లో నమోదు చేసిన ధరఖాస్తుదారుల వివరాలు పరిశీలించి అవి సరిగ్గా ఉన్నాయో లేదో నిర్ధారిస్తారు.

లారీలకు జీపీఎస్ అనుసంధానం

రెండో విడతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం నుంచి గొర్రెలను కొని తీసుకురానున్నారు. కొనుగోలు చేయటానికి లబ్ధిదారులతో పాటు ఏడీ స్థాయి అధికారి, జిల్లా స్థాయి అధికారి, అతడి సహాయక సిబ్బంది వెళ్తారు. అక్కడ ప్రతీ గొర్రె ఫొటో, చెల్లించిన ధర, కొనుగోలు చేసి స్థానిక ప్రాంతానికి తీసుకొచ్చే వరకు ఏర్పాటు చేసిన లారీ, దాని నంబర్, ప్రయాణించే మార్గం తదితర వివరాలను ఈ ల్యాబ్‌లో అప్‌లోడ్ చేస్తారు. గొర్రెలను తీసుకువచ్చే లారీలు లేదా ట్రక్కులను జీపీఎస్ సిస్టంకు అనుసంధానం చేస్తున్నారు. దీంతో ఆ వాహనాలు ఎక్కడ ఉన్నాయి, ఎటు వెళ్తున్నాయి అనేది తెలిసిపోతుంది. దీంతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చునని భావిస్తున్నారు.

594 దరఖాస్తులు వచ్చాయి



రెండో విడతలో గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాము. మొదటి విడతలో 1265కు 1206 యూనిట్లు పంపిణీ చేయగా 59 మందికి ఇవ్వాల్సి ఉంది. రెండో విడతలో 1251 యూనిట్లు, గతంలో రాని 59 కలిపి 1310 యూనిట్లు రావాల్సి ఉంది. ఇప్పటివరకు 594 ధరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్నాం. ఇంకా 716 ధరఖాస్తులు రావాల్సి ఉంది.

-డాక్టర్ పిట్టల చంద్రబాబు, పశువైద్యాధికారి, పెద్దవూర

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని చింతగూడెం గ్రామంలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు కోసం భూమి పూజ కార్యక్రమానికి ఆయన హాజరై శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని భక్తిభావం వైపు ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఇదిలా ఉంటే రామడుగు గ్రామ మాజీ సర్పంచ్ మజ్జిగపు నారాయణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి గ్రామంలో వారి నివాసానికి వెళ్లి నారాయణరెడ్డి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, అనుముల, తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండలాల ఎంపీపీలు పేర్ల సుమతిపురుషోత్తం, ఆంగోతు భగవాన్‌నాయక్, చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కూరాకుల లింగమ్మ, ఎంపీటీసీ యల్లమ్మయాదయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వడ్డిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముక్కమాల సర్పంచ్ గోన నరేందర్‌రావు, జిల్లా మున్సిపల్ కౌన్సిల్ ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు అన్నెపాక శ్రీనివాస్, ఆదాస్ విక్రమ్, దాత బైరెడ్డి కోటిరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు అంజాద్‌ఖాన్, షేక్ జానీ, బైరెడ్డి లింగారెడ్డి, పిల్లి వెంకయ్య, గంగయ్య, సోమయ్య, సత్యనారాయణ, వెంకట్ యాదవ్, రామారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణంలో భక్తులకు తాలిబొట్టు చూపుతున్న పూజారులు

పెద్దవూర : మండలంలోని తుమ్మడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ధ్వజ స్తంబ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతా రామ, శివ కేశవుల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ముందుగా విగ్రహ ప్రతిష్ఠాపనలో సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు, జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు భక్తులు విగ్రహాల అడుగు భాగంలో పంచలోహాలు, నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విరాళం అందజేత

మండలంలోని తుమ్మడ పల్లి గ్రామంలో సీతా రామ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కుందూరు జైవీర్ రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయ నిర్మాణానికి రూ. 1 లక్ష, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగా రెడ్డి రూ. 50 వేలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్ రూ. 20వేలు ఆలయంలో కార్యక్రమాలకు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ అధ్యక్షుడు శంకర్ నాయక్, పెద్దవూర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పప్పు గిరి, కోట నాగి రెడ్డి, నుల శోభ రమణా రెడ్డి, వద్ది రెడ్డి రవీందర్, కార్తీక్ రెడ్డి, సిద్దు, కమతం జగదీశ్వర్ రెడ్డి, కర్ణ గురువారెడ్డి, అనూష శరత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దామెదర్ రెడ్డి, అరుణ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కొండా రెడ్డి, నారాయణ రెడ్డి, గోవింద్ రెడ్డి, సాయి ఉన్నారు.

అంధత్వ నిర్మూలనకే 'కంటి వెలుగు'


సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మాడుగులపల్లి: అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం పరిశీలించి ఆయన మాట్లాడారు. వయోవృద్ధులకు పరీక్షల్లో ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు 937 మందికి పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్‌కు సిబ్బంది వివరించారు. అనంతరం ఓపీ రికార్డును పరిశీలించి, కళ్లద్దాల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అక్తర్ అలీ, వైద్యులు ప్రదీప్ కుమార్, ఫాతీమా, ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రామ్మోహనాచారి, మణి, ఆశావర్కర్లు, కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వంటావార్పు


దేవరకొండ : వంటావార్పులో భాగంగా కూరగాయలు తరుగుతున్న మహిళా జేపీఎస్‌లు


కొండమల్లేపల్లి : వంటావార్పులో పాల్గొన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


దామరచర్లలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న బీఎల్ఆర్

దేవరకొండ : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరింది.సమ్మెలో భాగంగా దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు వంటావార్పు నిర్వహించి తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పలువురు జూనియర్ పంచాయితీ కార్యదర్శులు మాట్లాడారు. గామాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించే పంచాయితీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు వెంకటేష్,విజయ్, సంధ్య,స్వామి,అనిల్, హరిత,రాజేశ్వరి,రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : చాలీచాలనీ జీతంతో నాలుగేళ్ల ప్రొబేషన్ కాలంలో పనిచేస్తున్న జేపీఎస్‌లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న జేపీఎస్‌ల శ్రమను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలన్నారు. జేపీఎస్‌లు, ఓపీఎస్‌లకు, మల్టీపర్పస్ కార్మికులకు న్యాయం జరిగేంతవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జేపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న ప్రదేశంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వంటావార్పు నిర్వహించి తమ నిరసన తెలిపారు. మండల కో ఆర్డినేటర్ జైహిందర్ మాట్లాడారు. కార్యక్రమంలో కిరణ్, శిరీషా, అనిల్, సత్యనారాయణ, ధరణి పాల్గొన్నారు.

డిండి : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయితీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో వేణు, హరి, శ్రీను, వాసు, గిరి, రాము, రహీం, సతీస్, విజయ్, ఉపేందర్, కృష్ణ, నవీన్, నాగేంద్రమ్మ, నవ్య, గీతా, అనూష తదితరులు పాల్గొన్నారు.

పాతపటేశ్వరమ్మ జాతరలో ఎమ్మెల్యే పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని తాళ్ల వీరప్పగూడెం గ్రామంలో వెలసిన శ్రీపాతపటేశ్వరమ్మ జాతరలో శుక్రవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలన్నారు. ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సాగర్ ఎడమకాల్వ మట్టి అక్రమంగా తరలింపు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఇరువైపులా ఉన్న మట్టిని కొంతమంది అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాల్వ సమీపంలోని రైతులు ఆరోపిస్తున్నారు. ఎడమ కాల్వ 49 కిలోమీటర్ల వద్ద పట్టపగలు అక్రమంగా జేసీబీతో లారీల్లోకి ఎత్తి మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నారు. మిర్యాలగూడ మండలంలోని వాటర్ ట్యాంక్ తండా సమీపంలో రైతుల పైపులైన్లను పగులకొట్టి సాగర్ ఎడమకాల్వ మట్టిని అక్రమంగా తవ్వుకుంటూ దౌర్జన్యానికి పాల్పడుతుండగా శుక్రవారం తండావాసులు కాంట్రాక్టర్లను అడ్డుకున్నారు. కాల్వకు ఇరువైపులా మట్టి ఉండడం వల్ల కాల్వకు గండ్లు పడకుండా పటిష్ఠంగా ఉంటుందని, మట్టిని తరలించడంతో కాల్వ కట్టలు బలహీనపడే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. మట్టిని తరలిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.


జేసీబీ సాయంతో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

బుద్ధవనంలో ఫొటోలకు అనుమతించాలి


మల్లెపల్లి లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహ

నాగార్జునసాగర్: ప్రపంచ ఆధ్యాత్మిక బౌద్ధమత కేంద్రమైన బుద్ధవనంలో టెండర్ ప్రక్రియ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు స్థానికులకు అవకాశం కల్పించాలని నాగార్జునసాగర్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహ శుక్రవారం బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్యకు వినతి పత్రం అందజేశారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేకపోవడంతో చాలామంది పర్యాటకులు ఆధ్యాత్మిక, ప్రకృతి ప్రేమికులు ఫొటోలు తీసుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చేవారు బుద్ధవనం సందర్శనలో భాగంగా ఫొటోలు వీడియోలు తీసుకునే అవకాశం కల్పిస్తే బుద్ధవనానికి ఆదాయం కూడా సమకూరుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు కొంతమేర ఉపాధి కూడా లభిస్తుందన్నారు. వినతి పత్రంలో పేర్కొన్నారు.

భగవాన్ సాద్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న గిరిజనులు

చందంపేట : మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో గిరిజనులు ఆరాధ్యంగా పూజించే శ్రీశ్రీశ్రీ భగవాన్ సాద్ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన గిరిజనులకు చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఇండియా గేట్ వద్ద మైసమ్మ చిత్రపటం ప్రదర్శన

మిర్యాలగూడ అర్బన్ : దామరచర్ల మండలం బాలాజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ కల్లెపల్లి బంగారు మైసమ్మ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని శుక్రవారం న్యూ ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ప్రదర్శించి తన భక్తిని చాటుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ జాతర మహోత్సవం దేశానికి తెలిసే విధంగా, అమ్మవారి మహిమలు అందరికి తెలిసే విధంగా అమ్మవారి చిత్ర పటాన్ని ప్రదర్శిస్తూ ప్రజలందరికీ జాతర శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.


బంగారు మైసమ్మ చిత్ర పటాన్ని ఇండియా గేట్ వద్ద ప్రదర్శిస్తున్న శ్రీను నాయక్

'బీజేపీ జోలికొస్తే ఊరుకునేది లేదు'

త్రిపురారం : గ్రామాల్లో బీజేపీ జోలికి వస్తే ఊరుకునేది లేదని త్రిపురారం బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదగిరి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులపై త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చెన్నాయి పాలెం గ్రామ పంచాయతీలో బీజేపీ ఏర్పాటు చేసుకున్న జెండా దిమ్మెలను బీఆర్ఎస్ నాయకులు గులాబీ కలరు వేసి ఆ పార్టీ జెండా ఎగురవేసుకున్నారన్నారు. ఆజెండా దిమ్మెను తీసుకెళ్లిన బీఆర్ఎస్ నాయకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కటకం మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి ధనావత్ గోవింద్ నాయక్, గిరిజన మోర్చ మండల అధ్యక్షుడు కెతావత్ రమేష్ నాయక్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ లోకేష్ నాయక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం


రాస్తారోకో చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

మాడుగుపల్లి : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల సీతారాంరెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలను నిరసిస్తూ, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిని దిగ్బంధించి బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ధర్నా కారణంగా రహదారిపై అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక అధికారులు సర్ది చెప్పడంతో నాయకులు ధర్నా విరమించారు.. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దమాం వెంకన్న, జిల్లా కార్యదర్శి నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకుడు జాన్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


మాడుగులపల్లి : గంద్రవానిగూడెం ఐకేపీ కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు


పీఏపల్లి : తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

మాడుగులపల్లి : అకాల వర్షం రైతులను నట్టేట ముంచాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించినా చివరికి కష్టం నీటిపాలే అయ్యింది. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురువడంతో కుక్కడం, గంద్రవానిగూడెం, చెరువుపల్లి, ఆగామోత్కూర్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కాంటా వేసిన బస్తాలు తడిసిపోయాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై అడపాదడపా జల్లులు కురిసినా పెద్దగా నష్టం జరుగలేదు.. కానీ శుక్రవారం కురిసిన వర్షం అన్నదాతలకు కన్నీటిని మిగిల్చింది. కేంద్రాల్లో వర్షం నీరు నిలువడంతో తొలగించేందుకు అన్నదాతలు శ్రమిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పీఏపల్లిలోనూ..

పెద్దఅడిశర్లపల్లి : మండల పరిధిలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం అకాల వర్షానికి నీటిపాలయ్యింది. గాలిదుమారంతో కూడిన వర్షం కురవడంతో ధాన్యం రాశులు నీళ్లల్లో కొట్టుకపోయాయి. తేమ పేరుతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడంతో ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయాయని అకాల వర్షాల కారణంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని రైతులు కోరుతున్నారు.